క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద గ్రామానికి చెందిన జమాన సూరిబాబు ఇటీవల కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. ఆయన కుటుంబం నిరుపేదది కావడంతో పలువురు ఆ కుటుంబానికి సాయపడేందుకు ముందుకు వచ్చారు. మృతుడి స్నేహితులంతా విరాళాల రూపంలో సేకరించిన రూ.60 వేలతో పాటు ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు తనవంతు సాయంగా అందించిన రూ.20 వేలు కలిపి బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు. మృతుడి కుటుంబానికి ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుకు వచ్చిన వారికి ధన్యవాదాలని, తనవంతు సాయం కూడా అందివ్వడం జరిగిందని భవిష్యత్‌లో కూడా ఆ కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్సీ సురేష్‌బాబు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్, సర్పంచ్ అట్టాడ కృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చరూ..



పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం సమీపంలో ఎం.రావివలస గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మూలకు చేరి నెలలు గడుస్తున్నా విద్యుత్ శాఖాధికారులు స్పందించడం లేదు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌పై పలువురు రైతులకు చెందిన వ్యవసాయ బోరుబావులకు, అలాగే కోళ్లఫారం, డెయిరీ ఫారానికి కనెక్షన్లు ఉన్నాయి. అయితే ఈ ట్రాన్స్‌ఫార్మర్ పాడైన విషయాన్ని విద్యుత్ శాఖాధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాడైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టవర్‌ను అల్లుకున్న పిచ్చిమొక్కలు



హై పవర్ విద్యుత్ టవర్‌కు పాకిన పిచ్చిమొక్కలు

లక్కవరపుకోట: మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ మెయిన్ గేట్‌కు సమీపంలో గల హైపవర్ విద్యుత్ టవర్‌కు పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. ఈ టవర్ ద్వారా విశాఖపట్నం నుంచి ఎస్.కోటకు విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే టవర్ చుట్టూ పిచ్చిమొక్కలు అల్లుకుపోవడంతో అటువైపు మేతకు వెళ్లే పశువులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న నిర్వాహకులు, భక్తులు

చీపురుపల్లి రూరల్: పట్టణంలో కృష్ణాష్టమి ముగింపు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున వీరబ్రహ్మం గారి గుడి వద్ద కృష్ణుడి ప్రతిమ ఏర్పాటు చేసి నిత్యపూజలు చేశారు. ఆదివారం ఆ ప్రతిమను వీరబ్రహ్మం గుడి నుంచి ఆంజనేయపురం, చీపురుపల్లి ప్రధాని రోడ్డు మీదుగా ఊరేగించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకుడు సూర్యనారాయణ, ప్రబోధ సేవాసమితి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్..కారాదు విపత్తు!

- వానాకాలంలో కరెంట్‌తో జాగ్రత్త
- నిర్లక్ష్యం కారణంగా పెరుగుతున్న ప్రమాదాలు
- జాగ్రత్తలు పాటించాలని అధికారుల సూచన



నగరంలోని విద్యుత్ సబ్ స్టేషన్

విజయనగరం: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఇళ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బావుల వద్ద ఈ ప్రమాదాలు పొంచి ఉంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణ, ఆస్తి నష్టం చోటు చేసుకుంటాయి. ఇటీవల విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఇదే తరహా ప్రమాదానికి గురై మరణించగా ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. 50 డివిజన్‌లలో విస్తరించనున్న విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 70 వేలకు పైగా నివాస భవనాలు ఉన్నాయి. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో విద్యుత్ ప్రమాద ఘటనలు చోటు చేసుకుంటున్నా వినియోగదారులు, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు నిర్వహణ పనులు చేపడుతున్నప్పటికీ అవగాహన లోపంతో వినియోగదారులు ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు.

వైరింగ్ ప్రధానం..

నివాసాలు, పరిశ్రమల్లో వైరింగ్ ముఖ్యం. విద్యుత్ వస్తువుల సామర్థ్యాన్ని అంచనా వేసుకోవడంతో పాటు భవిష్యత్ అవసరాలు తీర్చేలా పటిష్టమైన, నాణ్యమైన రాగి తీగలు కలిగిన వైర్లను వినియోగించాలి. వైరింగ్ రంధ్రాల్లో ఎలుకలు, వర్షం నీరు చేరకుండా చూసుకోవాలి. శిక్షణ పొందిన ఎలక్ట్రీషియన్లతో వైరింగ్ చేయించుకోవాలి.

బీఐఎస్ ముఖ్యం..

విద్యుత్ పరికరాలు, వైరింగ్ ఉపయోగించే తీగలు, వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు వంటి వాటికి ఇండియా స్టాండర్డ్ ఇనిస్టిట్యూట్(ఐఎస్ఐ) గుర్తింపు ముఖ్యం. ప్రస్తుతం దీనిని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)గా వ్యవహరిస్తున్నారు. వస్తువులపై ఈ గుర్తు నాణ్యతను సూచిస్తుంది. ఈ గుర్తింపు ఉన్న పరికరాలను వినియోగించాలి.

ఎర్తింగ్ అవసరం..

విద్యుత్ ప్రమాదాలకు ఎర్త్ చేయబడని పరికరాలే ప్రధాన కారణం. వ్యవసాయ పంపు సెట్లు, స్టార్టర్లు, నివాసాలను విధిగా ఎర్త్ చేయించాలి. ఎర్త్ చేయబడని మోటార్లు, స్టార్టర్లు, జీఐ పైపులు, పుట్వాలను రక్షణ లేకుండా తాకవద్దు. వర్షం కురిసిన సమయంలో జాగ్రత్తపడాలి. తడి ప్రదేశంలో ఇనుప కడ్డీని పాతి దానిని తీగ ద్వారా నివాసాల్లో మెయిన్‌కు, వ్యవసాయ మోటార్లకు అనుసంధానించాలి. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి. తద్వారా విద్యుదాఘాతాన్ని, అధిక విద్యుత్ సరఫరాతో పరికరాలు దగ్ధం కాకుండా నివారించవచ్చు.

సర్వీసు వైరు..

స్తంభం నుంచి విద్యుత్ సరఫరా చేసే సర్వీసు వైరు నాణ్యతగా ఉండాలి. దీనికి ఇన్సులేషన్ ఉన్న జీఐ వైరును సపోర్టుగా వాడడం ద్వారా ప్రమాదాలకు ఆస్కారం ఉండదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

- కరెంట్ పనులు లైసెన్స్ కలిగిన గుత్తేదారుతో మాత్రమే చేయించాలి, ఐఎస్ఐ మార్క్ కలిగిన వైర్లు, స్విచ్‌లు, స్విచ్ గేర్ తదితర పరికరాలు వాడాలి
- విద్యుత్ నియంత్రికల వద్ద అనధికారికంగా పూజలు వేయడం, మరమ్మతులకు పూనుకోవడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం ప్రమాదకరం, వీటిని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలి
- విద్యుత్ పరికరాలన్నింటికీ ఎర్తింగ్ తప్పనిసరి, కరెంటు ఉపకరణాలు ఉపయోగించే సమయంలో రబ్బర్ చెప్పులు, షూ తప్పనిసరిగా ధరించాలి
- ఆరుబయట వాడే వైర్లు, స్విచ్ బోర్డులు వాటర్ ప్రూఫ్‌వై ఉండాలి
- విద్యుదాఘాతం సంభవిస్తే వెంటనే కరెంట్ సరఫరా ఆపివేసి ప్లాస్టిక్ వస్తువు, ఎండు కర్రతో ప్రమాదం జరిగిన వ్యక్తిని వేరుచేయాలి, ప్రమాదానికి గురైన వ్యక్తికి ప్రథమ చికిత్స చేయాలి
- వర్షం కురుస్తున్న సమయంలో స్తంభాలను తాకరాదు, తీగలు తెగిపడితే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి
- కూలర్‌లో నీటిని నింపే సమయంలో తప్పనిసరిగా కరెంట్ సరఫరా నిలిపివేయాలి
- సాకెట్ నుంచి మొబైల్ చార్జర్, ఇతర పరికరాలను వేరుచేసే సమయంలో విద్యుత్ సరఫరా ఆపాలి
- కరెంట్ తీగలు తెగి వాహనాలపై పడితే వాహనం నుంచి కిందికి దిగొద్దు అలా చేస్తే విద్యుదాఘాతం జరిగే అవకాశం ఉంది
- విద్యుత్ పరికరాలు, తీగలపై దుస్తులు ఆరబెట్టరాదు. విలువైన పరికరాలకు ఎస్పీడీ, సర్జ్ ప్రొటెక్టివ్ డివైజ్‌ను ఉపయోగించాలి
- ఎత్తైన భవనాలు, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్లు, విద్యాసంస్థలపై పిడుగు రక్షణ(లైటనింగ్ ప్రొటెక్షన్) బిగించుకోవాలి
- పిల్లల ఆస్పత్రులు, విద్యాసంస్థల్లో షట్టర్ టైప్ సాకెట్ ఔట్‌లెట్లను ఉపయోగించాలి
- స్విమ్మింగ్ పూల్‌లలో విద్యుత్ పరికరాలు వాడొద్దు
- ఆస్పత్రులు, థియేటర్లలో ఎమర్జెన్సీ లైటింగ్ కోసం ప్రత్యేకంగా వైరింగ్ ఉండాలి
- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా తక్కువ ఎత్తులోని వైర్లను తాకరాదు. వర్షాలు కురిసినప్పుడు తడిచిన ఇనుప స్తంభాలు, విద్యుత్ ఉపకరణాలను తాకకూడదు
- టూఫేస్ విద్యుత్‌ను త్రీఫేస్‌గా మార్చే కన్వర్టర్లు వాడొద్దు.
- వంట గదిలో మిక్సీ, గ్రైండర్ వంటి పరికరాల తీగలకు తాకేలా కూరగాయలు తరిగే చాకులు, షార్ప్‌గా ఉండే పరికరాలు ఉంచొద్దు
- స్నానం చేశాక తడి శరీరంతో సెల్‌ఫోన్ చార్జర్ ఆన్‌లో ఉండగా దానిని తాకరాదు

అవగాహన కలిగి ఉండాలి..

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండడం ప్రతిఒక్కరికీ అవసరం. ప్రధాన లైన్‌లకు సంబంధించి ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. కరెంట్ గూర్చి తెలిసి తెలియని వారితో ఆ పనులు చేయించకూడదు. అప్రమత్తంగా ఉంటే ప్రమాదం జరగకుండా ఉంటుంది.

–కిరణ్‌కుమార్, ఏడీఈ, విజయనగరం

పెనుమత్స సాంబశివరాజు జీవితం ఆదర్శనీయం



పెనుమత్స సాంబశివరాజు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, నాయకులు

- ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు

నెల్లిమర్ల రూరల్: మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు జీవితం ఆదర్శనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు కొనియాడారు. మండలంలోని మొయిద గ్రామంలో సాంబశివరాజు 92వ జయంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మృతివనంలోని సమాధి వద్ద సదరు నాయకులు పూలమాలలు ఉంచి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంత ఎదిగినా ఒదిగి ఉండే స్వభావం సాంబశివరాజు సొంతమని, ఆయన ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా, టీటీడీ బోర్డు సభ్యుడిగా, ప్రొటెం స్పీకర్‌గా పనిచేసి, ప్రజలకు నిస్వార్థంగా సేవలందించారన్నారు. ఎంతోమందికి రాజకీయ ఓనమాలు నేర్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఐదు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో ఏనాడూ హెచ్చులకు పోలేదని నీతి, నిబద్ధత, విలువలతో కూడిన రాజకీయాలే చేశారని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డితోనూ ఆయనకు సాన్నిహిత్యం ఉండేదన్నారు. వైఎస్ మరణాంతరం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంట సుదీర్ఘకాలం నడిచి, వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. సాంబశివరాజు లేకపోవడం వైఎస్సార్ సీపీకి తీరని లోటు అని అన్నారు. తన తండ్రి మరణం తర్వాత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు రెండు సార్లు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని, ఆయన తనను గుర్తించిన తీరు ఎప్పటికీ మర్చిపోలేనని జీవితాంతం రుణపడి ఉంటానని ఎమ్మెల్సీ సురేష్‌బాబు తెలిపారు. తన ఊపిరి ఉన్నంత వరకు జగనన్న వెంటే నడుస్తానని, క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్ పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



విజేతలకు బహుమతి అందజేస్తున్న బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ అన్నపూర్ణ

విజయనగరం టౌన్: మన సనాతన హిందూ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. స్థానిక మెట్రో ఫంక్షన్ హాల్‌లో బ్రహ్మకుమారీస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన..ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ తమకున్న సమయంలో కొంత సమయాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నృత్య ప్రదర్శన పోటీల్లో రాధాకృష్ణులు, శ్రీకృష్ణసత్యభామల వేషధారణలతో చిన్నారులు చూపరులను ఆకట్టుకున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు మంత్రి చేతులమీదుగా మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మాన్సాస్ కరస్పాండెంట్ లక్ష్మీపతిరాజు, బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జ్ రాజయోగిని బీకే అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నా.

20న ఊరేగింపు..

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా స్థానిక గురజాడ కళాభారతిలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భగవద్గీత గొప్పతనాన్ని వక్తలు వివరించారు. ఆ తర్వాత అతిథులకు స్వామి చిత్రపటాలను అందజేశారు. ఈ నెల 20వ తేదీన స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు వి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నష్టం వివరాలు తెలియజేయండి

దత్తిరాజేరు: వరుసగా మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తుండడంతో గ్రామాలలో ఎటువంటి నష్టాలు జరిగినా తమకు సమాచారం అందించాలని తహసీల్దార్ విజయభాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పశువుల శాలలు, మిద్దె ఇళ్లు, పెంకుటిళ్లు కూలినా, చెరువులకు గండ్లు పడినా వీఆర్‌ఓలు అప్రమత్తమై సమాచారం సేకరించాలన్నారు. అలాగే పంటలకు నష్టం ఏర్పడినా సమచారం ఇవ్వాలన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు



సత్కారం పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

విజయనగరం టౌన్: నగరంలోని అయ్యన్నపేట జంక్షన్‌లో ఉన్న మదర్ థెరీసా కిడ్స్ స్కూల్ ఆవరణలో పలువురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ఆదివారం అందజేశారు. మదర్ థెరీసా సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు పొందిన 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.500 నగదు పారితోషికం, మెమెంటో, శాలువాలు, ప్రముఖ వ్యక్తుల జీవిత చరిత్ర పుస్తకాలు అందజేసి, సత్కరించారు. విద్యార్థులంతా ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని రిటైర్డ్ విద్యాశాఖ అధికారి మురహరి విశ్వేశ్వరరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు త్యాడ ప్రసాద్ పట్నాయక్, నెల్లిమర్ల డిప్యూటీ తహసీల్దారు జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వేపాడ: మండలంలోని ఓబలయ్యపాలెం గ్రామానికి చెందిన దాసరి లీల అనారోగ్యంతో బాధపడుతున్నారు. గ్రామానికి చెందిన ఎల్లమాంబ యువజన సేవా సంఘం సభ్యులకు సమాచారం తెలియడంతో రూ. ఐదు వేలు సేకరించి ఆదివారం బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అవగాహన

శృంగవరపుకోట: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి ఏయే గుర్తింపు కార్డులు చూపించాలి.. ఏయే బస్సులు ఎక్కాలో ఆర్టీసీ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈమేరకు ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపోలో అధికారులు మహిళలకు పథకంపై వివరించారు.

భారీ వర్షాలు.. రోడ్లన్నీ జలమయం!



వరద నీటితో నిండిన దేవుని నెలివాడ రోడ్డు

భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లన్నీ జలమయమయ్యాయి. తుపాను ప్రభావంతో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వానలతో గుంతలు కలిగిన రహదారుల్లో చేరిన వరదనీటితో ఎక్కడ ఏ గొయ్యి ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో నెల్లిమర్ల మండల రహదారులు, గ్రామీణ రోడ్లలో ప్రయాణించే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెమ్మదిగా వెళ్తున్నా కూడా వరద నీరేదో..గుంత ఏదో తెలియడం లేదని, సంక్రాంతి నాటికి అద్దాల్లా మెరిసే రోడ్లు వేస్తామని చెప్పారని..ఇలాగేనా చేసేదని వాహనదారులు కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. నెల్లిమర్ల–రణస్థలం ప్రధాన రహదారి అయితే మరీ అధ్వానంగా ఉందని బాగుచేయాలని కోరుతున్నారు.

–నెల్లిమర్ల రూరల్



గొల్లపేట సమీపంలోని రోడ్డు గుంతల్లోకి చేరిన వర్షపునీరు



సతివాడ రోడ్డులో భారీగా చేరిన వరద నీరు




కొత్తపేట రోడ్డుపైకి చేరిన వరద



ఆర్తిపాలెం జంక్షన్ వద్ద ఇలా..

గుర్లకు జ్వరమొచ్చింది..



గుర్ల గ్రామం వ్యూ

గుర్ల: మండల కేంద్రంలోని గుర్ల గ్రామంలో కొద్ది రోజుల కిందట డయేరియా ప్రబలి ప్రజలు ఇబ్బంది పడగా.. తాజాగా డెంగీ, మలేరియా ప్రబలింది. దీంతో ప్రతి ఇంటికీ ఓ జ్వరపీడితుడు ఉన్నారు. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గ్రామంలో సుమారు 50 మంది జ్వరాలతో ఇళ్ల వద్దే చికిత్స పొందుతుండగా... మరి కొంతమంది ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందుతున్నారు. మండలంలోని గుర్ల, తెట్టంగి పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో కూడా వైరల్ జ్వరాలు ప్రబలాయి. ఇదే విషయంపై గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ వద్ద ప్రస్తావించగా.. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తామన్నారు.

ఉన్నత పాఠశాలకు బోరు మంజూరు

దత్తిరాజేరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు బోరు మంజూరు చేసినట్లు ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 15న పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాగునీటి ఇబ్బందుల గురించి చెప్పగా బోరు మంజూరుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలోనే పాఠశాలను 'నాడు – నేడు'లో భాగంగా అభివృద్ధి చేసినట్లు చెప్పారు.